
సాక్షి
జనగామ
గురువారం । 26 । అక్టోబర్ । 2023



ఎండు గంజాయి పట్టివేత

ఎండు గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నెక్కొండ సీఐ హథీరాంనాయక్ తెలిపారు. - 10లో▸



కాటారంలో దొంగల బీభత్సం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలకేంద్రంలో దొంగలు తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడి నగదు, బంగారు ఆభరణాలు అపహరించారు. - 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $31^0/19^0$

జిల్లాలో ఉదయం చలి ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదకర వాతావరణం. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అమ్మవారి చీరలు, లడ్డూ ప్రసాదం వేలం



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లిలో బరోడా బ్యాంక్ వద్ద శ్రీదేవి నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన మంగళవారం రాత్రి అమ్మవారి చీరలు, లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. అమ్మవారి చీరలు, ప్రసాదం మొత్తంగా రూ.2,12,504లకు వేలంలో భక్తులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ బాధ్యులు కేశోజు అమరేందర్, గోరంతల రాజు, తదితర భక్తులు పాల్గొన్నారు.

లక్ష మెజార్టీతో గెలిపించాలి



జనగామ రూరల్: జనగామ నియోజకవర్గంలో లక్ష మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జనగామ మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో చేర్యాల, కొమురవెల్లి గ్రామాల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేసి కేసీఆర్‌ను మూడోసారి సీఎం అయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్యలున్న తన వద్దకు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు బి.కరుణాకర్, తలారి కీర్తన, మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు, గీసా భిక్షపతి, జల్లి సిద్దయ్య, అనంతుల మల్లేషం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్లే..



జనగామ రూరల్: కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్ఎస్‌కు ఓటు వేసినట్టేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని జూబ్లీ గార్డెన్‌లో పట్టణ అధ్యక్షుడు పవన్ శర్మ అధ్యక్షతన బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానికుడి ఆయన తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉడుగుల రమేష్, కొంతం శ్రీనివాస్, సొడ రమేష్, ఎల్లయ్య, మహిపాల్, శివరాజ్, నారాయణ, హరిశ్చంద్ర గుప్త, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యం కావాలి

నర్మెట: రానున్న ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త వీర సైనికుడై బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు, జనగామ అభ్యర్థి డాక్టర్ ఆరుట్ల దశమంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉమ్మడి మండలాల అధ్యక్షుడు ధరావత్ రాజు, ఆవుల శ్రీనివాస్ అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల, బూత్ అధ్యక్షుల ఎన్నికల అవగాహన సదస్సులో భాగంగా మండల కేంద్రంలోని ఓ గార్డెన్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యా వైద్యం, ఉద్యోగ, ఉపాధి కల్పనలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు శశిధర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉడుగుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సొడ రమేష్, పార్లమెంట్, అసెంబ్లీ కోకన్వీనర్లు కొంతం శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, జిల్లా నాయకులు శాతెల్లి రాజు, తిరుపతిరెడ్డి, ప్రయాగ నాగభూషణ శర్మ, కొన్నెరాజు, రాంబ్రహ్మం, చిర్ర తిరుపతిరెడ్డి, చెవుల రాజు, జహంగీర్, సిద్దులు, అంజనేయులు, మహిపాల్, నర్సింహారెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేరుకే పెద్దాస్పత్రి!

- చీటికి మాటికి రెఫర్లు
- నార్మల్ డెలివరీ పేరిట జాప్యం.. ఎమర్జెన్సీ అంటూ కంగారు
- మంత్రి హరీశ్‌రావుకు ఫిర్యాదు
- ఎంసీహెచ్ వైద్యుల నిర్లక్ష్యంపై వెల్లువెత్తుతున్న నిరసనలు



జనగామ మాతాశిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం

జనగామ: మెడికల్ కళాశాల ప్రారంభించుకున్నాం ..పెద్ద పెద్ద డాక్టర్లు వచ్చారు.. హైదరాబాద్ స్థాయిలో జరిగే సేవలన్నీ ఇక్కడే అంటూ ఎన్నో ఆశలు కల్పించారు. కాగితాలపై కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు కనిపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు నిదర్శనం జనగామ చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) చక్కటి ఉదాహరణగా నిలుస్తుంది. సర్కారు ఆదేశాల మేరకు సాధారణ ప్రసవాలపై దృష్టి సారిస్తున్న వైద్యులు.. క్రిటికల్‌గా ఉన్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాన్పు కోసం వచ్చిన గర్భిణులను సాయంత్రం వరకు వెయిటింగ్‌లో ఉంచుతూ.. సీరియస్‌గా ఉందంటూ హడావిడి చేస్తూ.. హనుమకొండ మెటర్నిటీకి రెఫర్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. అయ్యో సారు కండీషన్ బాగో లేదంటున్నారు... అంబులెన్స్ పిలిపించండి అంటూ బతిమిలాడినా 108కి చేసుకోండి... మా బాధ్యత కాదని చేతులు దులుపుకుని తల్లీబిడ్డల ప్రాణాలను గాలికి వదిలేస్తున్నారని పలువురు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

దేవరుప్పుల మండలం శాతపురం..

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం శాతపురం గ్రామానికి చెందిన వడ్డెపల్లి సుస్మితను ప్రసూతి కోసం కుటుంబ సభ్యులు ఈ నెల 23 (సోమవారం) ఎంసీహెచ్‌కు తీసుకు వచ్చారు. ఈ నెల 20వ తేదీన ఎంసీహెచ్‌కు చెకప్ కోసం వెళ్లగా, 22వ తేదీన డెలివరీకి సమయం ఉందని ఇంటికి పంపించారు. పురిటి నొప్పులు తీవ్రం కావడంతో 22న ఉదయం 108 అంబులెన్స్‌లో ఎంసీహెచ్‌కు రాగా, నార్మల్ డెలివరీ పేరిట మధ్యాహ్నం 3 గంటల వరకు వెయిటింగ్ చేయించారు. సుస్మితకు 147 బీపీ ఉందని.. ఇక్కడ డెలివరీ చేస్తే కష్టమని సాకు చెబుతూ.. హనుమకొండకు తీసుకువెళ్లాలని కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఒక్కసారిగా ఆందోళన చెందారు. ప్రైవేట్‌కు వెళతామని సుస్మిత మేనమామ సోమేశ్వర్ వైద్యులకు చెప్పగా, 108 అంబులెన్స్ రాదు, కేసీఆర్ కిట్టు ఇవ్వరని చెప్పారు. కనీసం అంబులెన్స్ మాట్లాడి హనుమకొండకు పంపించే ప్రయత్నం చేయాలని డాక్టర్లను వేడుకున్నా.. పట్టించుకోలేదని సోమేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. మార్గమధ్యలో డెలివరీ అయితే ఏంటీ అని ప్రశ్నిస్తే.. అలా ఏం కాదని కనీసం పట్టించుకోలేదని డాక్టర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి, సుస్మితను హనుమకొండకు తీసుకు వెళ్లారు. హనుమకొండ మెటర్నిటీ ఆస్పత్రిలో సుస్మితకు నార్మల్ డెలివరీ చేయగా, మూడున్నర కిలోల బరువు ఉన్న పండంటి బాబుకు జన్మనిచ్చింది. కాగా ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లా వంగపల్లికి చెందిన ఓ గర్భిణీ ఇద్దరు బాబులకు జన్మనిచ్చి చనిపోగా, ఎంసీహెచ్ వైద్యులు నిర్లక్ష్యం మూలంగానే తన కూతురు చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. ఎన్నికల హడివిడి మొదలు కావడంతో ఎంసీహెచ్ సేవలపై కనీసం పట్టించుకునే వారు లేరు. కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య వైద్యులు తీరుపై వెల్లువెత్తుతున్న నిరసనల నేపథ్యంలో క్షేత్రస్థాయి తనిఖీలు చేసి, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కఠినంగా శిక్షించాలి..

కోడలు సుస్మితను ఎంసీహెచ్‌కు తీసుకువెళ్లాము. సాయంత్రం వరకు నార్మల్ డెలివరీ కోసం వెయిట్ చేసి, మధ్యాహ్నం 3 గంటలకు బీపీ ఎక్కువగా ఉందని, ఇక్కడ డెలివరీ అయ్యే చాన్స్ లేనదని హనుమకొండకు రెఫర్ చేశారు. కనీసం అంబులెన్స్ మాట్లాడాలని బతిమిలాడినా ఏ ఒక్క డాక్టర్, సిబ్బంది పట్టించుకోలేదు. దేవుడి దయతో కోడలు పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఒక వేళ ఏమైన జరిగి ఉంటే బాధ్యత ఎవరు. ఈ విషయమై సంబంధిత డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బందిపై వాట్సప్ ద్వారా వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాం. ఫోన్ చేసి తమకు జరిగిన ఇబ్బందులను వివరించాం. ఎంసీహెచ్‌లో సీరియస్ అని చెప్పారు.. అక్కడ నార్మల్ డెలివరీ చేశారు. సుస్మితను ఎందుకు తీసుకు వచ్చారు... బాగానే ఉంది కదా అని హనుమకొండ మెటర్నిటీ వైద్యులు సైతం ఎంసీహెచ్ వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

– సోమేశ్వర్, బాలింత సుస్మిత మేనమామ

బీజేపీలో అసమ్మతి రాగం



హైదరాబాద్‌లో నేతలను కలిసిన జనగామ నియోజకవర్గ కేడర్

- అధిష్టానంతో తాడోపేడో
- జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో టికెట్ల మంటలు
- హైదరాబాద్‌కు 'బేజాటి' అనుచరులు
- టికెట్ కోసం కొట్లాడుతున్న 'బొజ్జపల్లి'
- బీసీ, మాదిగ సామాజిక వర్గాలపై చిన్నచూపు

జనగామ: జిల్లాలో బీజేపీలో అసమ్మతి రాగం రోజురోజుకు పెరుగుతుంది. బీసీ, మాదిగ సామాజిక వర్గానికి టికెట్ల కేటాయింపుల్లో వివక్షతపై అధిష్టానానికి నిరసన సెగ తప్పడం లేదు. బీజేపీ ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్యే టికెట్లపై పార్టీలో రెండు వర్గాలుగా చీలిపోయారు. పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తూ.. టికెట్ ఆశించి నిరాశకు గురైన ఇద్దరు నేతలు.. పార్టీ అభివృద్ధికి తాము పడిన కష్టాలను అధిష్టానానికి చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. జనగామ నియోజకవర్గంలో బీసీ నాయకుడు, జిల్లా ఉపాధ్యక్షుడు బేజాటి బీరప్ప, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన బొజ్జపల్లి సుభాష్ ఇద్దరికి టికెట్ రాకపోవడంతో తమనే నమ్ముకున్న కేడర్ నిరసన గళం వినిపిస్తున్నారు.

హైదరాబాద్‌కు పార్టీ శ్రేణులు

బచ్చన్నపేట మండలం తమ్మడపల్లిలో బీజేపీ కార్యకర్తలు, బీసీ నాయకులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకుని, బుధవారం పలు మండలాల శ్రేణులతో కలిసి హైదరాబాద్ బయలు దేరారు. జనగామ టికెట్ ఆరుట్ల దశమంత్‌రెడ్డికి ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ.. బీరప్ప అభ్యర్థిత్వాన్ని మరోసారి పరిశీలన చేయాలని రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్ ప్రకాష్ జవదేకర్, పార్టీ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, జాతీయ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌కు బహిరంగ లేఖ రాశారు. పార్టీలో బీసీ, వెనకబడిన నాయకులకు గుర్తింపు లేదని బాహాటం గానే ఆరోపణలు గుప్పిస్తున్నారు. అధిష్టానం నుంచి స్పష్టత వచ్చిన తర్వాతనే ఎన్నికల బరిలో దిగుతామని బేజాటి వర్గంలోని కార్యకర్తలు అంటున్నట్లు ప్రచారం జరుగుతుంది. బీసీ నాయకుడికి టికెట్ ఇస్తే, యువకులు, బీసీ బహుజనులు బీజేపీకి మద్దతు పలికే చాన్స్ ఉంటుందని హైదరాబాద్‌లో పార్టీ పెద్దలతో మనసు విప్పి మాట్లాడినట్లు సమాచారం.

'స్టేషన్'లో అదే పరిస్థితి

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన బీజేపీ నాయకుడు బొజ్జపల్లి సుభాష్ మొదటి నుంచి టికెట్ వస్తుందని నమ్మకంగా ఉన్నారు. నిత్యం కార్యకర్తలకు వెన్నంటి ఉంటూ బీజేపీ అభివృద్ధికి పాటు పడితే.. టికెట్ ప్రకటించే క్రమంలో కార్యకర్తల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోలేదని మండిపోతున్నారు. అత్యధిక ఓట్ల శాతం ఉన్న మాదిగలకు కాకుండా, నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని వారిని అభ్యర్థిగా ఎలా ప్రకటించారంటూ గుర్రుగా ఉన్నారు. స్టేషన్ కేడర్ సైతం అధిష్టానం వద్దకు వెళ్లనున్నట్లు సమాచారం. ఈ రెండు నియోజకవర్గాల్లో నిరసన సెగలు పార్టీకి తలనొప్పిగా మారిపోయింది. ఇటీవల సీనియర్ నాయకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోగా, వలసలు కొనసాగుతాయా అనే ప్రచారం ఉంది.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి: ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి, దేవరుప్పుల, తొర్రూరు మండలాలకు చెందిన ఇతర పార్టీల కార్యకర్తలు బుధవారం మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో రూపాని అయిలయ్య, రూపాని రాజు, ఇంద్రయ్య, జయబాబు, లింగన్నలు ఉన్నారు. కార్యక్రమంలో వీరస్వామి, పాడిశెట్టి వెంకన్న, వెలికట్టె వెంకన్న, ఈరంటి సాయి, వెలికట్టె మధు, సాధు చంద్రయ్య, తమ్మి మల్లికార్జున్, పసునూరి నవీన్, ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూ శ్రీనివాసరావు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంతరావు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

రూ.2 లక్షల బీమా

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బలోపేతం చేయడంతోనే అభ్యర్థులు గెలుపు సాధిస్తారని రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు అన్నారు. బుధవారం పాలకుర్తి పార్టీ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఉన్న 36 గ్రామ పంచాయతీలకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. సభ్యత్వం గల ప్రతీ ఒక్కరికి రూ. 2 లక్షల బీమా ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి మన గెలుపునకు సహకరించాలని కోరారు.

ఫుల్ కిక్కు..

15 రోజుల్లో రూ.21.39 కోట్లు

- మద్యం అమ్మకాల్లో దసరా రికార్డు

జనగామ: దసరా పండగ సంబురంలో కోట్లు 'తాగేశారు'. దావత్‌ల పేరిట రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. దసరా పండగతో చాలా రోజుల తర్వాత కలుసుకున్న స్నేహితులు, బంధువులు దావత్‌లతో పాత జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. దీంతో మద్యం అమ్మకాలు ఎక్సైజ్‌శాఖ అంచనాలకు మించి పెరిగాయి. దీంతో పండగ 15 రోజుల్లో రూ.21.39 కోట్ల వ్యాపారం జరిగింది. దసరా పండగ మద్యం అమ్మకాలు సర్కారు ఖజానా నింపేసింది. పండగ సంబురంతో సాధారణ రోజుల కంటే మూడింతల సేల్ పెరిగింది. వ్యవసాయ క్షేత్రాలు, ఫాంహౌస్‌లు, అటవీ ప్రాంతాల్లో గ్లాసుల గలగల, సీసాల సందడి కనిపించింది. గత ఏడాది దసరా పండగను పురస్కరించుకుని ఆరు రోజుల్లో రూ.11.53 కోట్ల మద్యం అమ్మకాలు జరిగింది. 38,442 లిక్కర్, బీర్ల కాటన్లు అమ్మగా, ఈ సారి వ్యాపారం రికార్డు బ్రేక్ చేసిందని చెప్పుకోవచ్చు.

ఈ నెల 10వ తేదీ నుంచి..

జనగామ జిల్లాలోని 12 మండలాల పరిధిలో 2023 అక్టోబర్ 10వ తేదీ నుంచి 24 వరకు రూ.21.39 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇందులో 19,966 లిక్కర్, 33,634 బీర్ల కాటన్ల విక్రయం జరిగింది. అత్యధికంగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో రూ.3.25 కోట్లు, అత్యల్పంగా కొడకండ్ల రూ.75.6 లక్షలు అమ్మకాలు జరిగాయి.



జిల్లాలో మద్యం అమ్మకాలు ఇలా..

మండలం	అమ్మకాలు (రూ.కోట్లలో..)
చిల్పూరు	1.06
స్టేషన్‌ఘన్‌పూర్	3.25
రఘునాథపల్లి	2.10
తరిగొప్పుల	61.46
పాలకుర్తి	1.63
జనగామ	8.01
నర్మెట	1.13
బచ్చన్నపేట	1.21
కొడకండ్ల	75.6లక్షలు
జఫర్‌గఢ్	80.8లక్షలు
దేవరుప్పుల	88.4లక్షలు
లింగాలఘనపురం	88.9లక్షలు

ఓటు విలువ తెలుసుకో..సమర్థులను ఎంచుకో..

రఘునాథపల్లి: రేటు కట్టి ఓటు కొనుక్కునే వారిని.. ఆలోచన, వివేకంతో నిలదీయాలని సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాధిక్ అలీ అన్నారు. ప్రత్యేక వాహనం ద్వారా మేలుకో.. ఏలుకో కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని 13, 14 వార్డుల్లో ఓటు హక్కు ఆవశ్యకత, ఎలాంటి వారిని ఎంచుకోవాలనే దానిపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాధిక్ మాట్లాడుతూ ఇప్పటికే మీ ఓటు వేసి గెలిపించిన వ్యక్తి, పార్టీని గత హామీలు ఎందుకు అమలు చేయలేదో ప్రశ్నించాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గణేష్‌ఠాకూర్, ఫౌండేషన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది సాదిక్‌అలీ

'రావు'ల రాజ్యం..

- పాలకుర్తిలో వెలమ సామాజిక వర్గానిదే రాజకీయ ప్రాతినిధ్యం
- ఎమ్మెల్యేగా ఏడుసార్లు గెలుపొందిన యతిరాజారావు

ప్రజలు చందాలు పోగేసి గెలిపించారు..

- చిన్న ఆరోపణ వస్తే సీఎంలు సంజీవ రెడ్డి, అంజయ్య పదవి నుంచి తప్పుకున్నారు..
- చేర్యాల మాజీ ఎమ్మెల్యే నాగపురి రాజలింగం

- 10లో▸

అగ్రనేతలొస్తున్నారు..

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ఓరుగల్లు బాట

- ఇప్పటికే మోదీ, రాహుల్, సీఎం కేసీఆర్ సభలు
- రేపు మరోసారి వరంగల్, మానుకోటకు ముఖ్యమంత్రి
- నవంబర్ మొదటి వారంలో అమిత్‌షా.. మరోమారు ప్రియాంక, రాహుల్ ప్రచారం



సాక్షిప్రతినిధి, వరంగల్: సార్వత్రిక సమరానికి ఓ వైపు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తుండగా.. రాజకీయ పార్టీల అగ్రనేతలు సైతం ఓరుగల్లు బాట పడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 9న షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. అంతకుముందే ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల్లో అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎన్నికల అధికారులుగా కలెక్టర్లే వ్యవహరిస్తున్నందున.. ఎక్కడా లోపం జరగకుండా అన్ని స్థాయిల్లో అధికారులను నియమించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను సైతం సిద్ధం చేశారు. ఎన్నికల నిర్వహణకు కేంద్రం పారామిలటరీ బలగాలను రంగంలోకి దింపగా.. ఉమ్మడి వరంగల్‌కు చేరుకున్నాయి. మరోవైపు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు ఓరుగల్లునే ఎంచుకుంటున్నారు. జూలై 8న వరంగల్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న నరేంద్రమోదీ ఓటర్లను జాగృతం చేయగా.. ఈనెల 18, 19 తేదీల్లో ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ఇక్కడి నుంచే ఎన్నికల శంఖారావం పూరించారు. 15న హుస్నాబాద్ నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టిన సీఎం కేసీఆర్, 16న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామలో తొలి సభ నిర్వహించి ప్రచార భేరీ మోగించారు.

హోరెత్తనున్న పార్టీల ప్రచారం..

ఉమ్మడి జిల్లాలో ఎన్నికల వేడి తీవ్రమవుతోంది. బీఆర్ఎస్ పన్నెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ నాలుగు, బీజేపీ తొమ్మిది నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేశాయి. జనగామ నుంచి సీఎం కేసీఆర్ బహిరంగ సభ నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించగా.. ఇదే సమయంలో ఆయా పార్టీల అగ్రనేతలు ఉమ్మడి జిల్లాలో పర్యటించేలా నాయకులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ తదితరులు, బీజేపీ నుంచి అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, కాంగ్రెస్ నుంచి మరోమారు అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ బహిరంగ సభల్లో పాల్గొనేలా షెడ్యూల్ రూపకల్పన చేస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా రాజకీయ పార్టీల ప్రచారాలతో హోరెత్తనుంది.

మరోమారు రాహుల్, ప్రియాంక..

ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ఇటీవలే ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాల్లో పర్యటించారు. రామప్పలోని రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద బస్సు యాత్రను ప్రారంభించారు. రామాంజపూర్, కాటారం సభల్లో వారు ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేశారు. వీరితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, అగ్రనేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి, పలువురు పాల్గొన్నారు. రెండ్రోజుల పాటు ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించిన యాత్రకు విశేష స్పందన లభించగా.. నవంబర్ మొదటి వారంలో కీలక నియోజకవర్గాలను తాకేలా రెండో విడత బస్సుయాత్ర చేపట్టేందుకు పార్టీ నేతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్యనేతలు, అభ్యర్థులు రేవంత్‌రెడ్డి ద్వారా కేసీ వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

అగ్రనేతలను రప్పించే ప్లాన్‌లో బీజేపీ..

కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్ తదితరులను రప్పించేందుకు బీజేపీ ఉమ్మడి జిల్లా నేతలు పార్టీ రాష్ట్ర చీఫ్ జి.కిషన్‌రెడ్డితో మంతనాలు చేస్తున్నారు. ఎన్నికల ట్రెండ్ మొదలవుతున్న క్రమంలోనే ప్రధాని నరేంద్రమోదీతో జూలై 8న వరంగల్‌లో బీజేపీ భారీ సభ నిర్వహించింది. వేల కోట్ల అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను చేసిన ఆయన.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ఓడించాలని కోరారు. ములుగులో ట్రైబల్ యూనివర్సిటీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆతర్వాత కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, పురుషోత్తం రూపాలా, కిషన్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఇప్పటికే తొమ్మిది అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన అధిష్టానం నర్సంపేట, ములుగు, పరకాలకు కూడా త్వరలోనే ప్రకటించనున్నామని వెల్లడించింది. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే బీజేపీ అగ్రనేతలు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్‌తో ప్రచార సభలకు ప్లాన్ చేసినట్లు ఆ పార్టీ ముఖ్యనేత ఒకరు తెలిపారు.

రేపు కేసీఆర్ రాక..

గులాబీ దళపతి, సీఎం కేసీఆర్ ఈ నెల 27న (రేపు) మరోమారు ఎన్నికల ప్రచారానికి రానున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఇరవై రోజుల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో నాలుగు సభలు నిర్వహించారు. కాగా ఈనెల 16న జనగామలో తొలి ఎన్నికల సభను నిర్వహించిన కేసీఆర్ 27న వర్ధన్నపేట, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు. దాదాపు 11 రోజుల వ్యవధిలో రెండోసారి ఓరుగల్లు పర్యటనకు వస్తున్న ఆయన కోసం మంత్రులు, పార్టీ నాయకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి సంబంధించి ప్రజా ఆశీర్వాద సభ భట్టుపల్లి సమీపంలో నిర్వహిస్తుండగా.. రెండు రోజులుగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే అరూరి రమేశ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ సభ అనంతరం మహబూబాబాద్‌లో పాల్గొంటారు. నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం అనంతరం మరో విడతలో మిగిలిన నియోజకవర్గాల్లో జరిగే ప్రచార కార్యక్రమాల్లో సీఎం పాల్గొనే అవకాశం ఉంటుందని పార్టీవర్గాల సమాచారం.

ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం

- కలెక్టర్ శివలింగయ్య

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ శివలింగయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 2.30లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు సిద్ధంగా ఉందన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో 79 సెంటర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఆధ్వర్యంలో 92 సెంటర్లు మొత్తం 171 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి రైతులకు టోకెన్లు ఇవ్వాలని, గన్నీ సంచులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కేంద్రాల్లో మౌలిక వసతులు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ యంత్రాలు అందుబాటులో ఉంచాలని అధికారు లను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు తీసుకువచ్చే సమయంలో నిబంధనల ప్రకారం మ్యాశ్చర్ చూడాలని రైతులను కోరారు. ధాన్యం వివరాలు ఓపీఎంఎస్ విధానంలో వెంటనే నమోదు చేయాలని తద్వారా డబ్బులు త్వరగా చెల్లించడానికి వీలు ఉంటుందన్నారు. ఏమైన ఇబ్బందులు ఉంటే కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్ నంబర్ 6303928718ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మొగులప్ప, డీఎస్ఓ రోజారాణి, డీఎం ప్రసాద్, డీఎంఓ నరేందర్‌రెడ్డి, ఏపీడీ నురుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య



కొంతమందికే అధికారం లభించినంత మాత్రాన అది నిజమైన స్వరాజ్యం కాదు. అధికారాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే నిజమైన స్వరాజ్యం వచ్చినట్లు.
- మహాత్మాగాంధీ

ఈ ముచ్చటెరికేనా ?

బూత్ క్యాప్చరింగ్ అంటే..



జనగామ: ఎన్నికల నియమాల విషయంలో ఎలక్షన్ కమిషన్ కఠినంగా వ్యవహరిస్తోంది. పోలింగ్ కేంద్రాన్ని స్వాధీనం చేసుకుని.. పోలింగ్‌ను అడ్డుకోవడాన్ని బూత్ క్యాప్చరింగ్ అంటారు. ఎవరైన కావాలని బ్యాలెట్ పేపర్, ఈవీఎంలను పాడు చేయడం, ధ్వంసం చేయడం, ఎన్నికల గుర్తులపై సిరా పోయడం వంటివి దీని పరిధిలోకి వస్తాయి. పోలింగ్ కేంద్రంలో ఓటర్లను భయపెట్టడం, పోలింగ్‌ను అడ్డుకోవడంపై ఎలక్షన్ కమిషన్ నేరంగా పరిగణిస్తుంది. ఇలా చేస్తే ప్రభుత్వ సిబ్బంది అయితే ఐపీసీ 1951, సెక్షన్ 135ఏ, 136 ప్రకారం 3 నుంచి 5 ఏళ్ల జైలుతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ఇతరులైతే ఒకటి నుంచి మూడు ఏళ్ల జైలు శిక్ష వేస్తారు.

పోలింగ్ కేంద్రంలో పొగ తాగితే నేరం..



జనగామ: పోలింగ్ కేంద్రంలో పొగ తాగితే ఎలక్షన్ కమిషన్ నేరంగా పరిగణిస్తుంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ స్టేషన్‌తో పాటు పరిసరాల్లో సిబ్బంది, ఏజెంట్లు, ఇతరులు ధూమ పానం చేయొద్దు. సిగరెట్, బీడీ తాగితే శిక్షార్హులు. పరిశీలకులు పోలింగ్ స్టేషన్ పరిసరాల్లో జరిగే కార్యక్రమాలను పరిశీలిస్తారు. ఇందులో ఎవరైనా పొగ తాగినట్లు కనిపిస్తే చర్యలు తీసుకుంటారు. అలాగే, ధూమపానంతో ఓటర్లు ఇబ్బందులు పడితే అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు.

'రావు'ల రాజ్యం..

పాలకుర్తిలో వెలమ సామాజిక వర్గానిదే రాజకీయ ప్రాతినిధ్యం
- ఎమ్మెల్యేగా ఏడుసార్లు గెలుపొందిన యతిరాజారావు
- రెండు సార్లు సతీమణి విమలాదేవి..
- మరోసారి తనయుడు డాక్టర్ సుధాకర్‌రావు
- తెలంగాణ ఉద్యమంతో 'దుగ్యాల' పాగా
- పునర్విభజనతో 'యతి' కోటలో ఎర్రబెల్లి వరుస విజయాలు




ఎస్ వెంకటకృష్ణప్రసాద్


నెమరుగొమ్ముల యతిరాజారావు


నెమరుగొమ్ముల విమలాదేవి


కుందూరు మధుసూదన్‌రెడ్డి


డాక్టర్ ఎస్.సుధాకర్‌రావు


డాక్టర్ దుగ్యాల శ్రీనివాసరావు


ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల: అసెంబ్లీ చరిత్రలో నాటి నుంచి.. నేటి వరకూ ఎప్పుడు నియోజకవర్గాల పునర్విభజన జరిగినా పాలకుర్తి జనరల్‌గానే కొనసాగుతోంది. దీంతో ఇక్కడ 'రావు'ల (వెలమ) సామాజిక వర్గానికి చెందిన నేతలే రాజకీయ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1957 నుంచి మొదలు.. నేటి వరకూ ప్రత్యర్థి పార్టీల నుంచి రెడ్డి, బీసీ సామాజిక వర్గం అభ్యర్థులు పోటీ చేసినా రాజకీయ పరిణామాలతో నెమరుగొమ్ముల యతిరాజారావు స్వతంత్ర, సోషలిస్టు, కాంగ్రెస్ పక్షాన బరిలో నిలిచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలాగే, యతిరాజారావు సతీమణి విమలాదేవి ఒక్కసారి గెలుపొందారు. మరోసారి కుందూరు మధుసూదన్‌రెడ్డిపై ఓడినా కోర్టు ద్వారా రెండున్నర సంవత్సరాలు మరోమారు ఎమ్మెల్యేగా కొనసాగారు. వృద్ధాప్యం దరి చేరడంతో యతిరాజారావు తన పెద్ద కుమారుడు, ప్రముఖ వైద్యుడు సుధాకర్‌రావుకు టీడీపీ టికెట్ ఇప్పించి ఎమ్మెల్యేగా గెలిపించారు. ఇలా తొమ్మిది దఫాలు నెమరుగొమ్ముల కుటుంబం చట్టసభల్లో ప్రాతనిథ్యం వహించింది. కాగా, యతిరాజారావు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీ రామరావుకు అత్యంత సన్నిహితుడిగా ఉంటూ ఉమ్మడి రాష్ట్రంలో దేవాదాయశాఖ మంత్రిగా, ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా, ఏపీ ఇండస్ట్రీయల్ కార్పొరేషన్ చైర్మన్‌గా, అసెంబ్లీ ప్రొటెం స్పీకర్ పదవులు నిర్వర్తించి చరిత్రలో నిలిచారు.

'యతి' కోటలో దుగ్యాల పాగా..

చెన్నూరు నియోజకవర్గ చరిత్రలో ఎన్ని రాజకీయ మార్పులు వచ్చినా పైచేయి సాధించిన 'యతి' కోటలో తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్‌ఎస్ అభ్యర్థి దుగ్యాల శ్రీనివాసారావు అనూహ్యంగా పాగా వేశారు. అప్పటికే 'యతి' కుటుంబంలో పోటు చేసుకున్న అంతర్గత రాజకీయ విభేదాలతో రెండో కుమారుడు నెమరుగొమ్ముల ప్రవీణ్‌రావు కాంగ్రెస్‌లో చేరి ఎన్నికల బరిలో నిలవడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే సుధాకర్‌రావు, దుగ్యాల శ్రీనివాసరావు మధ్య త్రిముఖ పోటీ అనివార్యమైంది. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యే సుధాకర్‌రావు ఓటమి పాలయ్యారు.

పునర్విభజనతో పాలకుర్తిలో ప్రవేశించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు..

2009లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనతో వర్ధన్నపేట ఎస్సీ రిజర్వ్ అయి చెన్నూరు పాలకుర్తి నియోజవర్గంగా ఆవిర్భవించింది. ఈ నియోజకవర్గంలో రాయపర్తి మండలం కలవడంతో వర్ధన్నపేట నియోజకవర్గ అనుబంధం మండలాన్ని ఆసరా చేసుకుని ఎర్రబెల్లి దయాకర్‌రావు టీడీపీ తరపున పోటీ చేసి సుధాకర్‌రావుపై గెలుపొందారు. దీంతో రాజకీయంగా ప్రాబల్యం కోల్పోయిన డాక్టర్ ఎస్ సుధాకర్‌రావు టీఆర్‌ఎస్‌లో చేరి క్రియాశీలకంగా పనిచేస్తూ తన ఆధిపత్యం చాటుకున్నారు. ఈ క్రమంలోనే 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎర్రబెల్లి, దుగ్యాల, నెమరుగొమ్ముల మధ్య త్రిముఖ పోటీ నెలకొనగా దయాకర్‌రావు వరుస విజయబావుట ఎగురవేశారు. అయితే ఈసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఉన్న ప్రజావ్యతిరేకతను అధిగమించేందుకు, నేతల్లో ఉన్న అసంతృప్తులను తొలగించేందుకు డాక్టర్ సుధాకర్‌రావుకు ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ పదవి ఇప్పించడంలో మంత్రి ఎర్రబెల్లి సఫలీకృతమయ్యారు. దీంతో ఇక పాలకుర్తిలో తనకు ప్రత్యర్థులు లేరని భావించే క్రమంలో స్థానికురాలు, ఎన్‌ఆర్‌ఐ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి కాంగ్రెస్ పక్షాన రంగంలో దిగడంతో పోటీ తీవ్రత అనివార్యంగా మారింది.

పాలకుర్తి నియోజకవర్గ వివరాలు

జనగామ జిల్లా పరిధిలో పాలకుర్తి నియోజకవర్గం ప్రాతినిధ్యం కలిగి ఉంది. ఈ నియోజకవర్గంలో జనగామ జిల్లా-3, వరంగల్ జిల్లా-1, మహబూబాబాద్ జిల్లా-2 మండలాలతోపాటు తొర్రూరు మున్సిపాలిటీకలిపి ఆరు మండలాల భాగస్వామ్యంతో 178 గ్రామాలు ఉన్నాయి.

పాలకుర్తి మండలం	:36 గ్రామాలు
కొడకండ్ల మండలం	:21 గ్రామాలు
తొర్రూరు మండలం	:29 గ్రామాలు 1 మున్సిపాలిటీ
పెద్దవంగర మండలం	:20 గ్రామాలు
రాయపర్తి మండలం	:40 గ్రామాలు
దేవరుప్పుల మండలం	:32 గ్రామాలు

పాత చెన్నూరు, కొత్త పాలకుర్తిలో గెలిచిన ఎమ్మెల్యేలు వీరే..

సం.	గెలిచివారు	పార్టీ	సమీప అభ్యర్థి	పార్టీ
1957	ఎస్. వెంకటకృష్ణప్రసాద్	పీడీఎఫ్	ఎస్. యతిరాజారావు	కాంగ్రెస్
1962	ఎస్. యతిరాజారావు	సోషలిస్టు	ఎం. వెంకట్రామయ్య	కాంగ్రెస్
1967	నెమరుగొమ్ముల విమలాదేవి	కాంగ్రెస్	నల్ల నర్సింహులు	సీపీఎం
1972	కుందూరు మధుసూదన్‌రెడ్డి	స్వతంత్ర	ఎస్. విమలాదేవి	కాంగ్రెస్
1975	ఎస్. యతిరాజారావు	స్వతంత్ర		ఏకగ్రీవం
1978	ఎస్. యతిరాజారావు	కాంగ్రెస్	ఎస్. చిత్తరంజన్‌రెడ్డి	జనత
1983	ఎస్. యతిరాజారావు	కాంగ్రెస్ (ఐ)	కె. మధుసూదన్‌రెడ్డి	స్వతంత్ర
1985	ఎస్. యతిరాజారావు	టీడీపీ	కె. వెంకట్రామ్‌రెడి	కాంగ్రెస్
1989	ఎస్. యతిరాజారావు	టీడీపీ	కె. మధుసూదన్‌రెడ్డి	కాంగ్రెస్
1994	ఎస్. యతిరాజారావు	టీడీపీ	ఎం. జగన్నాథం	కాంగ్రెస్
1999	డాక్టర్ ఎస్. సుధాకర్‌రావు	టీడీపీ	కె. మధుసూదన్‌రెడ్డి	కాంగ్రెస్
2004	దుగ్యాల శ్రీనివాసరావు	టీఆర్‌ఎస్	డాక్టర్ ఎస్. సుధాకర్‌రావు	టీడీపీ
2009	ఎర్రబెల్లి దయాకర్‌రావు	టీడీపీ	దుగ్యాల శ్రీనివాసరావు	కాంగ్రెస్
2014	ఎర్రబెల్లి దయాకర్‌రావు	టీడీపీ	దుగ్యాల శ్రీనివాసరావు	కాంగ్రెస్
2018	ఎర్రబెల్లి దయాకర్‌రావు	టీఆర్‌ఎస్	జంగా రాఘవరెడ్డి	కాంగ్రెస్

ప్రజలు చందాలు పోగేసి గెలిపించారు

- చిన్న ఆరోపణ వస్తే సీఎంలు సంజీవ రెడ్డి, అంజయ్య పదవి నుంచి తప్పుకున్నారు
- ఇప్పుడు రాజకీయాల్లో నైతికత లేదు
- చేర్యాల మాజీ ఎమ్మెల్యే నాగపురి రాజలింగం
- 'సాక్షి'తో ప్రత్యేక ఇంటర్వ్యూ



జనగామ: 'విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పని చేస్తూ జనం సమస్యలు పట్టించుకున్నా.. రైతాంగం, యువత, కార్మికులతో అనుబంధం ఉండేది.. అప్పటి హనుమకొండ పార్లమెంట్ నియోజకవర్గంలో నా చురుకుదనాన్ని గమనించిన హయగ్రీవాచారి, దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు రాజకీయ అరంగ్రేటం చేయించారు. ఈ ప్రాంతంలో పార్టీకి మరింత వన్నె తీసుకురావాలంటే బీసీ నేత సేవలు అవసరమని భావించి బతిమిలాడి ఉద్యోగానికి రాజీనామా చేయించారు. ఉద్యోగానికి రాజీనామా చేసి మొదటిసారి 1981లో సమితి ప్రెసి డెంట్‌గా పోటీ చేసి విజయం సాధించానని' చేర్యాల మాజీ ఎమ్మెల్యే నాగపురి రాజలింగం గౌడ్ అన్నారు. నాటి, నేటి రాజకీయ పార్టీల్లో ఉన్న నైతిక విలువలు, తేడా, ఓటర్లు, ఇతరత్రా విషయాలపై ఆయన 'సాక్షి'తో ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

1999లో ఎమ్మెల్యేగా

1981లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి సమితి ప్రెసిడెంట్‌గా గెలుపొందా. 1985, 1989, 1994లో సొంత, ఇతర పార్టీల పెద్దలు నాకు టికెట్ రాకుండా అడ్డుకోవడంతో ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన. విజయం సాధించలేకపోయినా ప్రజలు చూపించిన ప్రేమ, అభిమానం నేటికి మరవలేను. చందాలు వేసుకుని వాహనాలు, నామినేషన్ ఫీజు సైతం ప్రజలు భరించారు. నాడు కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అభ్యర్థికి డిపాజిట్ గల్లంతయింది. ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన మూడు సార్లు గౌరవ ప్రదమైన ఓట్లు వచ్చాయి. మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వచ్చిన తర్వాత చేర్యాలలో నా ప్రజాబలం చూసి కాంగ్రెస్ తరఫున టికెట్ ఇప్పించారు. మొదటి సారి 1999లో ఎమ్మెల్యే అయిన తర్వాత ఢిల్లీలో తెలంగాణ కోసం ప్రశ్నించాననే కోపంతో ఇక్కడ కూటమిగా ఏర్పడి 2004లో తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నారు. మహానుభావుడు రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 2007(రెండేళ్లు), 2009(ఆరేళ్లు) రెండు సార్లు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. నాడు రాజకీయాలు వేరు. ప్రజలతో ఎవరు ఉంటే వారినే గౌరవించారు.

ప్రతి మండలంలో అభివృద్ధి చేశా

చేర్యాల నియోజకవర్గంలోని ప్రతి మండలంలో అభివృద్ధి విషయంలో నా మార్కు కనిపిస్తుంది. విద్య, వైద్యం, తాగునీరు, రహదారుల నిర్మాణం ఇలా అనేక కార్యక్రమాలు నా హయాంలోనే జరిగాయి. 45 హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేయించా. బచ్చన్నపేట, చేర్యాల, నర్మెట, మద్దూరు, ఇతర ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేయించా. అనేక గ్రామాల్లో నిరుపేదలకు స్థలాలు ఇప్పించి, ఇందిరమ్మ పథకంలో గృహాల నిర్మాణం చేపట్టాం. ఈ విషయంలో కోర్టుకు హాజరయ్యా. ఇప్పుడు ఆ స్థలాల ధరలు పెరగడమే కాకుండా ఊరికి ప్రధానంగా మారాయి.

ఎన్నికల ఖర్చుకు 40 బస్తాల కందుల విక్రయం

1999లో టికెట్ ఖరారు కాగానే సర్పంచ్‌కు పోటీ చేసే డబ్బు కూడా నా వద్ద లేదు. ఇంట్లో ఉన్న 40 బస్తాల కందులు అమ్మితే రూ.38 వేలు వచ్చాయి. మిగతా డబ్బు ప్రజల నుంచి చందాల రూపంలో వస్తే, అతి తక్కువ ఖర్చుతో విజయం సాధించా.

ప్రస్తుతం నైతిక విలువలు కరువు..

నాటి రాజకీయాలు.. నేటి వ్యవస్థకు పూర్తిగా వ్యతిరేకం. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులు నీలం సంజీవ రెడ్డి, అంజయ్యపై చిన్న ఆరోపణలు రాగానే పదవుల నుంచి స్వచ్ఛందంగా తప్పుకుని తమ నిజాయితీని నిరూపించుకున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ప్రస్తుతం వేలకోట్లు దండుకున్నా.. అడిగే నాథులే కరువయ్యారు. జనాన్ని ఆకట్టుకునే పథకాల పేరిట రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచడం, భవిష్యత్ లేకుండా చేయడం ఆందోళన కలిగిస్తోంది. నైతిక విలువలు, ప్రజలతో సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తులకు నేడు ఏ రాజకీయ పార్టీలు కూడా గౌరవం ఇవ్వడం లేదు. రూ.100 కోట్లు ఉన్న నాయకుడే టికెట్‌కు అర్హుడనే ట్రెండ్ తీసుకొచ్చారు. ప్రస్తుతం నైతిక విలువలు కనుమరుగయ్యాయి.

'దళత బంధు'పై ఎమ్మెల్యేకు నిరసన సెగ

బయ్యారం: దళితబంధు పథకం కొందరికే అమలు చేశారంటూ మండలంలోని సత్యనారాయణపురం ఎస్సీ కాలనీ వాసులు ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ వాహనాన్ని బుధవారం రాత్రి అడ్డుకున్నారు. దళితబంధు, గృహలక్ష్మి పథకాలతో పాటు తమ కాలనీలో ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ తీగలపై ఎమ్మెల్యే సమాధానం ఇవ్వాలని నిలదీశారు. దీంతో హరిప్రియ మాట్లాడుతూ... ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వ పథకాల అమలు జరగడం లేదని, ఎన్నికల తర్వాత పథకాలతోపాటు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.


ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకుని నిలదీస్తున్న ఎస్సీ కాలనీవాసులు

రూ. 40 వేల విలువైన మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

గీసుకొండ: మండల కేంద్రంలోని దొమ్మరివాడలో అక్రమంగా విక్రయిస్తున్న రూ. 40 వేల విలువైన మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పాకనాటి స్వప్న కిరాణ(బెల్ట్)షాపులో మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని తదుపరి చర్యల నిమిత్తం గీసుకొండ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై నర్సింహారావు తెలిపారు.

ఎండు గంజాయి పట్టివేత

నెక్కొండ: ఎండు గంజాయి తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని నెక్కొండ సీఐ హథీరాం నాయక్ తెలిపారు. ఈమేరకు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నెక్కొండ రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం 8 గంటలకు రైలు దిగి వస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీ చేసి విచారణ చేపట్టారు. ఇందులో ఒడిశాలోని గంజాం జిల్లా దావగాన్ గ్రామానికి చెందిన గోబింద బెహేర్ ఆ రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్లు తేలిందన్నారు. అదే రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లా ఖలేమెలా మండలానికి చెందిన సమీర్‌హోల్డర్ నుంచి బెహేర్ గంజాయి కొనుగోలు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడు బహేర్ నుంచి రూ. 2.75 లక్షల (11 కిలోలు) విలువైన గంజాయితోపాటు రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై షేక్ జానీపాషా, హెడ్‌కానిస్టేబుల్ సోమ్లానాయక్, సిబ్బంది ఎస్. రాకేష్, మహ్మద్ అన్వర్ అక్బాస్ పాల్గొన్నారు.


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ హథీరాం నాయక్, ఎస్సై జానీపాషా

ఆర్టీసీ బస్సు ఢీ.. ఒకరి మృతి


యశ్వంత్ మృతదేహం

చిల్పూరు: ఆర్టీసీ బస్సు ఢీ కొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వంగాలపల్లి స్టేజీ సమీపంలో జరిగింది. ఎస్సై వినయ్‌కుమార్ కథన ప్రకారం ధర్మసాగర్ మండలం నర్సింగరావు పల్లికి చెందిన తోట యశ్వంత్ (24) బుధవారం రాత్రి స్వగ్రామం వెళ్లేందుకు వంగాలపల్లి బస్ స్టేజీ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన యశ్వంత్‌ను కానిస్టేబుల్ వీరన్న ఎంజీఎం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కాలం చెల్లిన బీర్లు సీజ్

నర్సింహులపేట: మండల కేంద్రంలోని న్యూ శబరి వైన్స్ షాపులో రూ.1.80 లక్షల విలువైన కాలం చెల్లిన బీర్లను సీజ్ చేసినట్లు తొర్రూరు ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు బుధవారం తెలిపారు. కాలం చెల్లిన బీర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ. 90 వేల నగదు స్వాధీనం


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

రామన్నపేట : నగరంలోని ఎంజీఎం సెంటర్‌లో బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో గోపాలస్వామి గుడి ప్రాంతానికి చెందిన దేవులపల్లి రామకృష్ణ ఎలాంటి ఆధారం లేకుండా తన వెంట తీసుకెళ్తున్న రూ.90 వేల నగదు సీజ్ చేసినట్లు మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నగదు సీజ్ చేసి డీజీఎంసీకి అప్పగించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం స్టేజీ శివారు జగ్యా తండా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందారు. పెద్ద నాగారం స్టేజీకి చెందిన కొమ్ము ఎల్లమ్మ(60) బుధవారం ఉదయం జగ్యా తండాకు నడుచుకుంటు వెళ్తున్నారు. ఈ క్రమంలో బొలెరో వాహనం ఎదురుగా వస్తూ ఎల్లమ్మను ఢీకొంది. దీంతో ఎల్లమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

కుతాటి రీనాకర్‌కు జైలు శిక్ష

శాయంపేట : శాయంపేట పీఎస్‌లో 2018లో నమోదైన కేసులో బుధవారం పరకాల మేజిస్ట్రేట్ లింగం శాలిని నిందితుడు కుతాటి రీనాకర్, అతని భార్య లావణ్యకు జైలుశిక్షతోపాటు రూ. 10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. శాయంపేట గ్రామానికి పసునూటి పూజాశ్రీనిధిని ఇదే గ్రామానికి చెందిన కుతాటి రీనాకర్ ప్రేమిస్తున్నానని మాయమాలు చెప్పి తన భార్య లావణ్య సాయంతో పెళ్లి చేసుకున్నాడు. కాగా, తన తల్లిదండ్రులకు తెలియకుండా పూజశ్రీని రీనాకర్ వివాహం చేసుకున్నారు. అనంతరం హింసిస్తుండగా పూజశ్రీ 2018లో శాయంపేటలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి చార్జీషీట్ ఫైల్ చేసి పరకాల కోర్టులో సమర్పించగా మేజిస్ట్రేట్ లింగం శాలిని సాక్షులను విచారించి కూతాటి రీనాకర్‌కు 6 సంవత్సరాల జైలు శిక్ష, రూ. పదివేల జరిమానా, అతడి భార్య లావణ్యకు 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో తీర్పు త్వరితగతిన వచ్చేలా కృషి చేసిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కర్రు రుధిర, కానిస్టేబుల్ శ్రీనివాస్, ప్రసాద్‌ను పరకాల ఏసీపీ కిశోర్ కుమార్, పరకాల రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్ అభినందించారు.

పడిలేచిన ఈతచెట్టు


నేలపై పడిపోయి.. తిరిగి లేచిన ఈతచెట్టు

పరకాల: హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో ఓ ఈత చెట్టు భారీ వర్షాల కారణంగా కింద పడిపోయింది. కల్లు తీసే క్రమంలో చెట్టు పడిపోవడంతో దానిపై ఆధారపడిన గీతాకార్మికులు నిరుత్సాహం చెందారు. అయితే కొంత కాలం తర్వాత భూమిపై పడిపోయిన ఈత చెట్టు మళ్లీ లేచి కల్లు తీయటానికి అనుకూలంగా ఎదగడాన్ని చూసి గీతాకార్మికులు సైతం ఆశ్చర్యపోయారు. భూపాలపల్లి రోడ్డులోని నారాయణబొత్తల వద్ద ఓ టీస్టాల్ వెనుక కనిపించే ఈ చెట్టు.. అనకొండలా వంకలు తిరిగి.. పైకి లేచికనిపిస్తున్నది. ఈ దృశ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గామాత నిమజ్జనంలో ఘర్షణ

- యువకుడిపై నలుగురి దాడి

ఖిలా వరంగల్: శంభునిపేట 37వ డివిజన్ దూపకుంట రోడ్డు గిరిప్రసాద్‌నగర్‌కు చెందిన ఎస్ కే.సుబాన్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి 11 గంటలకు ఎస్.కె.సుబాన్ ఇంటికి సంతోశ్(సంతు), ఎండీ.రెహాన్, ఎ.నాగరాజు వచ్చారు. దుర్గామాత నిమజ్జనానికి వెళ్దామని నమ్మించి బెస్తం చెరువు వద్దకు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టారు. ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారు. ఈ ఘటనపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఎండీ సుబాన్ తెలిపారు.

ఇచ్చిన డబ్బులడిగినందుకు..

వరంగల్ 37వ డివిజన్ జన్మభూమి జంక్షన్ సమీపం లక్ష్మీనగర్‌కు చెందిన పాపరబోయిన విజయ్ టాటా ఏస్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఉద్యోగం ఇప్పిస్తానని అదే ప్రాంతానికి చెందిన తడక సతీశ్ అతడిని నమ్మించి రూ.20 వేలు తీసుకున్నాడు. ఏడాది గడిచినా ఉద్యోగం ఇప్పించకపోవడంతో సతీశ్‌ను నిలదీశాడు. నన్నే నిలదీస్తావా? అంటూ సతీశ్ అతడి స్నేహితులతో కలిసి మంగళవారం సాయంత్రం విజయ్ ఇంటిపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఈదాడిలో విజయ్‌కి తీవ్ర గాయలయ్యాయి. బుధవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు విజయ్ తెలిపారు.

కాటారంలో దొంగల బీభత్సం..

- రెండు ఇళ్లలో చోరీ
- మూడున్నర తులాల బంగారం, రూ.20వేల అపహరణ

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. పండుగ సందర్భంగా ఇంటి యజమానులు గ్రామాలకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రేపాల సురేందర్ ఈ నెల 20న, ముస్కుల సురేందర్‌రెడ్డి ఈ నెల 22న ఇళ్లకు తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి గోదావరిఖనికి వెళ్లారు. ఈ నెల 24న సదరు కుటుంబాల సభ్యులు ఇంటికి చేరుకొని చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అనుమానం వచ్చి ఇళ్లలోకి వెళ్లి చూడగా బీరువాలు తెరిచి ఉన్నాయి. అందులోని వస్తువులన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. దీంతో బాధితులు బుధవారం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అభినవ్, ప్రొబేషనరీ ఎస్సై ప్రసాద్ ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. వేణుగోపాల్ ఇంట్లో 2 తులాల బంగారం, రూ.20 వేల నగదు, సురేందర్‌రెడ్డి ఇంట్లో తులంన్నర బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించారు. అనంతరం నేర విభాగల సిబ్బంది ఫింగర్‌ప్రింట్స్‌తో పాటు పరిసరాలు పరిశీలించి సమాచారం సేకరించారు. ఈ ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబేషనరీ ఎస్సై ప్రసాద్ తెలిపారు.


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యులు

కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి..

- ఎస్సారెస్పీ కాల్వలో పడి యువకుడి మృతి

పెద్దవంగర: కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన ఓ యువకుడు కాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని పోచంపల్లిలో జరిగింది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామానికి చెందిన దండెంపల్లి శివ (31) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని తన మేనమామ వద్దకు వచ్చాడు. బావమరిది ప్రవీణ్‌తో కలిసి బైక్‌పై నాంచారిమడూర్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఎస్సారెస్పీ కాల్వ వద్దకు వెళ్లి అందులో జారి పడ్డాడు. ప్రవీణ్ కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో శివ గల్లంతయ్యాడు. బుధవారం పెద్దవంగర మండలం పోచంపల్లి పరిధిలోని ఎస్సారెస్పీ కాల్వలో శివ మృతదేహం కనిపించింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో వారు ఘటనాస్థలికి చేరుకుని పంచానామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.


శివ (ఫైల్)